

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సబీహా బేగం

ఫాగింగ్ స్పెషల్ డ్రైవ్ ప్రారంభం

అల్లాపూర్, మే 30(ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ శ్రీవివేకానందనగర్‌లో కార్పొరేటర్ సబీహా బేగం జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగపు సిబ్బందితో కలిసి శుక్రవారం పర్యటించారు. ఎంటమాలజీ స్పెషల్ డ్రైవ్ ఫాగింగ్ నెట్ ఫైలట్ ప్రోగ్రాంలో భాగంగా దోమల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సబీహా బేగం మాట్లాడుతూ, కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో దోమల బెడద అధికమైందని, దోమల నివారణ కోసం జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం వారితో కలిసి 'ఫాగింగ్ ఫైలట్ స్పెషల్ డ్రైవ్' చేపట్టామన్నారు. అన్ని కాలనీల్లో ఫాగింగ్ తప్పని సరిగా చేయాలని ఎంటమాలజీ అధికారులకు కార్పొరేటర్ సూచించారు. కార్యక్రమంలో శ్రీవివేకానందనగర్ కాలనీ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు రోణంకి జగన్నాథం, యాదవ రెడ్డి, రవీందర్ రెడ్డి, కృష్ణారావు, కమ్మరి శ్రీనివాస్, మురళి, అమ్ములు, లక్ష్మి, ఎంటమాలజీ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఏ.ఈ.సోని, ఈఎఫ్ఏ పద్మ పాల్గొన్నారు.



కొందరు వాకింగ్ చేస్తుండగానే క్రికెట్ ఆడుతున్న యువకులు

రాక్ గార్డెన్ పార్కులో వాకర్స్‌కు సమస్యలు

అల్లాపూర్, మే 30(ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ పరిధిలోని గాయత్రి నగర్ రాక్ గార్డెన్ పార్కులో వాకింగ్ అంటూ మహిళలు, వయోజనులతో పాటు చిన్న పిల్లలు అధికంగా వస్తూంటారు. కాంక్రీట్ జంగిల్ నడమ ఇలా ఆహ్లాదభరిత వాతావరణంలో వాకింగ్ చేద్దామనుకునే వారికి ఇబ్బందికర పరిస్థితి నెలకొందని, పార్కులో కొంతమంది యువకులు క్రికెట్ ఆడుతూ తమను ప్రమాదంలో నెడుతున్నారని, గతంలో కూడా పలుమార్లు వాకింగ్ చేస్తున్నవారికి బంతి తగిలి గాయమైందని స్థానికులు వాపోతున్నారు. పార్కును కేవలం వాకింగ్‌కే ఉపయోగించాలంటూ, షటిల్ బ్యాడ్మింటన్‌లాంటి ఆటలైతే ఎటువంటి ప్రమాదం ఉండదని, రబ్బరు బంతి తలకు, కళ్లలాంటి సున్నిత అవయవాలకు తగిలితే పెద్ద సమస్య తలెత్తవచ్చని, క్రికెట్ ఆటను పార్కులో ఆడనీకుండా నివారించాలంటూ స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గణపతి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

భెల్‌కాలనీ, మే 30(ఆంధ్రజ్యోతి): బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని విజయ గణపతి ఆలయంలో లక్ష్మీగణపతి హోమం ఘనంగా జరిగింది. జేష్ట శుద్ధ చవితి చతుర్థి సందర్భంగా భెల్ టౌన్‌షిప్, ఎంఐజీ, ఎల్ఐజీ కాలనీల్లో గల గణపతి ఆలయాల్లో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. భెల్ కాలనీలోని యోగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని వినాయక ఆలయంలో చతుర్థిపూజలు నిర్వహించారు. అయప్పస్వామి ఆలయం, పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయాల్లో గల వినాయకస్వామి అంతరాలయాల్లో అభిషేకాలు జరిగాయి. షిర్డీసాయి బాబా దేవాలయంలోని విజయగణపతి ఆలయంలో విశేష పూజలు చేశారు. గణపతికి పంచామృతాభిషేకం, గరికతో అర్చనలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సూత్రధారులు, పాత్రధారులెవరు?

- ఆంధ్రజ్యోతి కథనంతో అధికారుల్లో కలవరం
- హౌసింగ్‌బోర్డు స్థలం ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడంపై తీవ్ర విమర్శలు
- రూ.28 కోట్ల విలువైన స్థలం కబ్జా అవుతుంటే ఏం చేస్తున్నారనే అనుమానాలు
- ఆరా తీస్తున్న హౌసింగ్‌బోర్డు, జీహెచ్ఎంసీ శాఖల ప్రధాన కార్యాలయాలు

కేపీహెచ్‌బీకాలనీ, మే 30(ఆంధ్రజ్యోతి): కైత్లాపూర్ సమీపంలో హౌసింగ్‌బోర్డు స్థలాన్ని అప్పనంగా ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే యోచనలో ఉన్న విషయాన్ని శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' "రూ.కోట్ల స్థలానికి ఎసరు?" అనే శీర్షికతో కథనాన్ని ప్రచురించిన విషయం విదితమే. ఈ కథనంతో జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోనల్, మూసాపేట్ సర్కిల్, టీజీహెచ్‌బీ వెస్ట్రన్ డివిజన్ అధికారులకు ముచ్చెమటలు పట్టాయి. గజం రూ.లక్ష చొప్పున వేలానికి ఉంచిన తరుణంలో అక్కడ రూ.28 కోట్లు అధికారికంగా వేలంలో గజం రూ.1.25-1.75లక్షల వరకు పోతుందన్న అంచనాలు ఉండగా, అంత విలువైన స్థలం కబ్జా అవుతుంటే కళ్లు మూసుకున్నారా? అని రాష్ట్ర ప్రధాన కార్యాలయం నుంచి ఆరా తీసినట్లు తెలిసింది. దీంతో వెస్ట్రన్ డివిజన్ అధికారులు సరైన సమాధానం చెప్పలేక నీళ్లునమిలినట్లు సమాచారం. ఇదే సమయంలో ఈ వ్యవహారంలో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం కూకట్‌పల్లి జోన్, మూసాపేట్ సర్కిల్ అధికారుల పాత్ర ఏమైనా ఉందా అని ఆరా తీశారని తెలిసింది. హౌసింగ్ బోర్డు, జీహెచ్ఎంసీ శాఖల బాస్‌ల నుంచి క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న అధికారు లకు అక్షింతలు పడటంతో కలవరానికి గురయ్యారు. సుమారు రూ.100 కోట్ల స్థలం వృథాగా పోయే అవకాశాలపై కూడా సమాచారం రాబట్టినట్లు తెలిసింది. సర్వే నంబర్ 988లో ఓ బిల్డర్, ప్రైవేట్ వ్యక్తులకు మేలు జరిగేలా చేయడంలో కీలకంగా వ్యవరిస్తున్నది ఎవరు అనేది ప్రశ్నగా మారింది. అధికారుల పాత్ర ఏ మేరకు ఉందనేది తెలుసుకునేందుకు మరోసారి విచారణ చేసే యోచనలో ఉన్నారని సమాచారం. తప్పుడు మార్గంలో అనుమతి పొందిన సదరు బిల్డర్ పనులను ఆపాల్సిన అధికారులు ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు వ్యవహరించడంపై ఆయా శాఖల ఉన్నతాధికారులు 'ఆంధ్రజ్యోతి'లో కథనాన్ని చూసి క్లాస్ తీసుకున్నారట. ఇప్పటికైనా ఆమ్యామ్యాలకు తలగ్గొకుండా 40 అడుగుల రోడ్డు స్థలాన్ని కాపాడి, ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన నిధులను ప్రైవేటు వ్యక్తులకు చెందకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



కబ్జా చేసిన స్థలంలో కొనసాగుతున్న నిర్మాణాలు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కేపీహెచ్‌బీకాలనీ, మే 30(ఆంధ్రజ్యోతి): టీజీఎస్‌పీడీసీఎల్ బాలాజీనగర్ సెక్షన్ పరిధిలోని ఫీడర్ల నిర్వహణ పనుల నిమిత్తం పలు ప్రాంతాల్లో శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని ఏఈ భీమలింగప్ప తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు హబీబ్‌నగర్, మసీద్, పవర్ నగర్ పార్కు, జేఎన్ఎన్‌యూఆర్ఎం, డంపింగ్ యార్డ్.. మధ్యాహ్నం 3 నుంచి 3.30 గంటల వరకు కేపీహెచ్‌బీ 4, 15వ ఫేజ్‌లు, మహేంద్ర అపార్ట్‌మెంట్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు శ్రీరాంనగర్‌లో ఎమ్మెల్యే పర్యటన

కేపీహెచ్‌బీకాలనీ, మే 30(ఆంధ్రజ్యోతి): కైత్లాపూర్ సమీపంలోని శ్రీరాంనగర్‌లో శనివారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పర్యటించనున్నారు. కార్పొరేటర్ పగుడాల శిరీష బాబూరావు, అధికారులతో కలిసి ఓపెన్ నాలా, భూగర్భ డ్రైనేజీ పనులను ఎమ్మెల్యే పరిశీలించనున్నారు.

వేధింపులతోనే బీఆర్ఎస్ నాయకుడి మృతి

- కాంగ్రెస్ నాయకులపై మండిపడ్డ ఎమ్మెల్యే మాధవరం

కూకట్‌పల్లి, మే 30(ఆంధ్రజ్యోతి): బోరబండలో 50గజాల్లో ఇళ్లు కట్టుకుంటున్న పేద కుటుంబానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు సర్దార్ కాంగ్రెస్ నాయకుల వేధింపులతోనే మృతి చెందాడని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆరోపించారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పక్క నియోజకవర్గంలోని అయ్యప్ప సొసైటీలో ఎలాంటి అనుమతులు లేకుండా 6 నుంచి 8 అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నా కళ్లుమూసుకున్న అధికారులు, 50 గజాల్లో అదనపు అంతస్తు వేసుకుంటే అక్రమ నిర్మాణమంటూ కూల్చడం ఎంతవరకు సబబని మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. బోరబండ మైనార్టీ నాయకుడు సర్దార్‌మృతికి కారుకులైన వారిపై వెంటనే కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం నిర్వహించే ప్రజావాణి ప్రజల కోసం కాదని, కాంగ్రెస్ నాయకుల వసూళ్ల కోసమేనని విమర్శించారు. పరోక్షంగా మున్సిపల్ అధికారులు కాంగ్రెస్ నాయకులకు సహకారం అదిస్తున్నార న్నారు. 18 నెలల కాంగ్రెస్ పాలనలో నగరంలో ఎక్కడా అభివృద్ధి జరగలేదన్నారు. ఫతేనగర్ బ్రిడ్జి పనులు పూర్తిచేయకుంటే సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి నిరాహార దీక్షకు దిగుతామని ఆయన హెచ్చరించారు. ఈ బ్రిడ్జి విస్తరణ కోసం బీఆర్ఎస్ హయంలోనే రూ.60 కోట్లు కేటాయించి రైల్వే అనుమతులు కూడా ఇప్పించినట్లు గుర్తుచేశారు. అల్లాపూర్ నుంచి దీన్‌దయాళ్‌నగర్‌కు నాలా విస్తరణకు తమ హయాంలోనే నిధులు మంజూరు చేసినా పనులు మాత్రం జరగడం లేదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్లు

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, మే 30(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు (కిలో, రూపాయల్లో).. టమోటా 15, వంకాయ 18, బెండ 40, పచ్చిమిర్చి 35, బజ్జి మిర్చి 28, కాకర 38, బీర 38, క్యాబేజీ 12, బీన్స్ 85, క్యారెట్ 28, గోబి పువ్వు 23, దొండ 15, చిక్కుడు 65, గోరు చిక్కుడు 35, బీట్‌రూట్ 17, క్యాప్సికం 45, ఆలుగడ్డ 24, కీర 23, దోస 15, సొర 12, పొట్ల 23, కంద 55, ఉల్లిగడ్డ 22, చామగడ్డ 35, చిలగడ దుంప 26, గుమ్మడి 25, బొప్పాయి 40, పుట్టగొడుగులు 40, ఎండు మిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 140, చింతపండు 160, పండుమిర్చి 80, ఆ కాకరకాయ 60. పైన పేర్కొన్న ధరలు ఈరోజు ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

రేపు తులసి నగర్ సంక్షేమ సంఘం ఎన్నిక

అల్లాపూర్, మే 30(ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ తులసి నగర్ సంక్షేమ సంఘానికి రేపు ఎన్నికలు జరుగనున్న విషయం విధితమే. గత కొన్నేళ్లగా ఇక్కడ ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నా, ఈసారి రెండు వర్గాల మధ్య పోటీ నెలకొంది. తులసి నగర్ వీధుల్లో పోస్టర్లు, స్టిక్కర్లు, బ్యాండ్ బాజాలతో పోటాపోటీగా ప్రచారం చేస్తున్న అభ్యర్థులు, మద్దతుదార్ల మధ్య తీవ్ర పోటీ ఉంది. సుమారు 450 మంది సభ్యులున్న తులసి నగర్ సంక్షేమ సంఘానికి సూర్యచంద్ర, అంకిత్ సింగ్ అధ్యక్ష పదవికి పోటీ పడుతున్నారు.

ఆటోను ఢీకొట్టిన లారీ.. 14 మందికి గాయాలు

- ఒకరి మృతి.. మరొకరి పరిస్థితి విషమం

రాయదుర్గం, మే 30(ఆంధ్రజ్యోతి): రెడీమిక్స్ కాంక్రీట్ లారీ వేగంగా దూసుకువచ్చి ఆటోను ఢీ కొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో 13 మంది కార్మికులకు గాయాలయ్యాయి. ఈ ఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని గోపనపల్లి ఎన్‌టీఆర్ నగర్‌లో శుక్రవారం ఉదయం జరిగింది. ఇన్‌స్పెక్టర్ హబీబ్ ఉల్లా ఖాన్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం 9.30 గంటల సమయంలో గోపనపల్లి ఎన్‌టీఆర్ నగర్ నుంచి వట్టినాగులపల్లి గ్రామం వైపు కూలీలతో వెళ్తున్న ఆటోను లారీ వెనక నుంచి వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న 14 మంది కార్మికులకు గాయాలు కాగా, వారిలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన దిల్‌ఖుష్ అనే వ్యక్తిని సిటిజన్ ఆసుపత్రికి, కిము అనే వ్యకిన్తి శ్రీకర ఆసుపత్రికి తరలించారు. కాగా దిల్‌ఖుష్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో గాంధీ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి

గచ్చిబౌలి, మే 30(ఆంధ్రజ్యోతి): రాబోయే వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని, మాన్‌సూన్ టీమ్‌లను ఏర్పాటు చేసి జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అధికారులకు సూచించారు. శుక్రవారం సాయంత్రం జోనల్ కమిషనర్‌ను కలిసి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధ్యలో నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించాలని కోరారు. మరిన్ని అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని, ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు సహకరించాలన్నారు. మియాపూర్ కార్పొరేటర్ శ్రీకాంత్, నాయకులు రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



జోనల్ కమిషనర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

రేపు మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం

గచ్చిబౌలి, మే 30(ఆంధ్రజ్యోతి): నల్లగండ్లలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల కల్యాణోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త జగదీశ్వర్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు ఈ ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వార్లను దర్శించుకోవాలని, ఈ కార్యక్రమాలకు రాష్ట్ర మంత్రులు రానున్నారని చెప్పారు.



సీతారామచంద్రస్వామి తిరుకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కనుల పండువగా సీతారామచంద్రస్వామి తిరుకల్యాణం

ఖైల్‌కాలనీ, మే 30(ఆంధ్రజ్యోతి): మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ సీతారామచంద్రస్వామి దివ్యకల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఎంఐజీకాలనీలోని రామాలయంలో శుక్రవారం స్వామివారి తిరు నక్షత్రం సందర్భంగా నిత్యపూజలతో పాటు విశేష అర్చనలు చేశారు. స్వామివారి కల్యాణ మండపంలో సీతామచంద్రస్వామి ఉత్సవ విగ్రహాలకు దివ్యతిరు కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పెద్దింటి వెంకట భాస్కర సత్యనారాయణచార్యుల పర్యవేక్షణలో కల్యాణ మహోత్సవం జరగగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గణపతి ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఖైల్‌కాలనీ, మే 30(ఆంధ్రజ్యోతి): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని విజయ గణపతి ఆలయంలో లక్ష్మీగణపతి హోమం ఘనంగా జరిగింది. జేష్ట శుద్ధ చవితి చతుర్థి సందర్భంగా ఖైల్ టౌన్‌షిప్, ఎంఐజీ, ఎల్ఐజీ కాలనీల్లో గల గణపతి ఆలయాల్లో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఖైల్ కాలనీలోని యోగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని వినాయక ఆలయంలో చతుర్థిపూజలు నిర్వహించారు. అయప్పస్వామి ఆలయం, పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయాల్లో గల వినాయకస్వామి అంతరాలయాల్లో అభిషేకాలు జరిగాయి. షిర్డీసాయి బాబా దేవాలయంలోని విజయగణపతి ఆలయంలో విశేష పూజలు చేశారు. గణపతికి పంచామృతాభిషేకం, గరికతో అర్చనలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన లారీ.. 14 మందికి గాయాలు

● ఒకరి మృతి.. మరొకరి పరిస్థితి విషమం

రాయదుర్గం, మే 30(ఆంధ్రజ్యోతి): రెడీమిక్స్ కాంక్రీట్ లారీ వేగంగా దూసుకువచ్చి ఆటోను ఢీ కొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో 13 మంది కార్మికులకు గాయాలయ్యాయి. ఈ ఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని గోపనపల్లి ఎన్‌టీఆర్ నగర్‌లో శుక్రవారం ఉదయం జరిగింది. ఇన్‌స్పెక్టర్ హబీబ్ ఉల్లా ఖాన్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం 9.30 గంటల సమయంలో గోపనపల్లి ఎన్‌టీఆర్ నగర్ నుంచి వట్టినాగులపల్లి గ్రామం వైపు కూలీలతో వెళ్తున్న ఆటోను లారీ వెనక నుంచి వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న 14 మంది కార్మికులకు గాయాలు కాగా, వారిలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన దిల్‌ఖుష్ అనే వ్యక్తిని సిటిజన్ ఆసుపత్రికి, కిము అనే వ్యక్తిని శ్రీకర ఆసుపత్రికి తరలించారు. కాగా దిల్‌ఖుష్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలపడంతో గాంధీ ఆసుపత్రికి తరలిస్తుండగా మరణించాడని పోలీసులు వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బస్తీ దవాఖానా ఏర్పాటుతో సత్ఫలితాలు

- ఎంఐజీకాలనీలో రెండేళ్ల క్రితం ఏర్పాటు
- అందుబాటులోకి ల్యాబ్.. అత్యవసర వైద్య సేవలు
- మెరుగైన వైద్యసేవలతో పెరుగుతున్న రోగుల సంఖ్య



ఎంఐజీకాలనీలోని బస్తీ దవాఖానా

ఖైల్‌కాలనీ, మే 30(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ఖైల్ ఎంఐజీకాలనీ పేజ్-1 సొసైటీ కార్యాలయ ఆవరణలో రెండేళ్ల క్రితం మే 31న ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానా సత్ఫలితాలనిస్తోంది. వృద్ధులు, మధ్యతరగతి ప్రజలు నివసించే ఎంఐజీకాలనీలో బస్తీదవాఖానా ఏర్పాటు కోసం డివిజన్ కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు చేసిన ప్రయత్నానికి ఏర్పాటైన దవాఖానా మెరుగైన వైద్య సేవలు అందిస్తోంది. దీంతో ప్రతిరోజూ సుమారు 75 మంది వరకు ఇక్కడ వైద్య సేవలు పొందుతున్నారు. వైద్యురాలు డాక్టర్ రేష్మ పర్యవేక్షణలో వివిధ సమస్యలపై చికిత్సలు అందిస్తున్నారు. అయితే కాలనీలో ప్రభుత్వ భవనాలు లేనందున సొసైటీ కార్యాలయంలోనే బస్తీ దవాఖానాను ప్రారంభించి సేవలందిస్తున్నారు. ల్యాబ్ సౌకర్యం సైతం ఉండటంతో ప్రజలకు ఉపయోగకరంగా ఉంది.

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం



కాలనీవాసులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో అందరికీ అందుబాటులో ఉండే విధంగా సొసైటీ కార్యాలయ ఆవరణలో బస్తీ దవాఖానాను ఏర్పాటు చేశాం. ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా ఇక్కడ సేవలను అందిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాలు ఉత్తమ సేవలు అందిస్తున్నాయి. నాణ్యమైన వైద్యసేవలతో ఒకప్పుడు ప్రభుత్వ దవాఖానాలంటేనే భయపడే ప్రజలు నేడు బస్తీ దవాఖానాల ముందు బారులు తీరుతున్నారు.

- సింధూఆదర్శ్‌రెడ్డి, కార్పొరేటర్, భారతీనగర్ డివిజన్



ఆస్పత్రిలో ఉన్న ఔషధాలు



సీఐకి వినతిపత్రం అందజేస్తున్న రామకృష్ణ

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి

గచ్చిబౌలి, మే 30(ఆంధ్రజ్యోతి): కొండాపూర్ ప్రాంతంలోని ఇజ్జత్‌నగర్‌లో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సీపీఐ మండల కార్యదర్శి రామకృష్ణ మాదాపూర్ ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్య ఉంటుందని వివరించారు. ఇజ్జత్‌నగర్ గుండా కూకట్‌పల్లి వైపు వేళ్లేందుకు రోడ్డు నిర్మించడంతో ఈ సమస్య ఉత్పన్నమవుతున్నట్లు తెలిపారు. అసలే చిన్న రోడ్లు ఉన్నాయని, పెద్దవాహనాలు రావడంతో బస్తీలో ట్రాఫిక్ సమస్యతో స్థానికులు నరకయాతన పడుతున్నారని వాపోయారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి

గచ్చిబౌలి, మే 30(ఆంధ్రజ్యోతి): రాబోయే వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని, మాన్‌సూన్ టీమ్‌లను ఏర్పాటు చేసి జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అధికారులకు సూచించారు. శుక్రవారం సాయంత్రం జోనల్ కమిషనర్‌ను కలిసి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధ్యలో నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించాలని కోరారు. మరిన్ని అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని, ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ శ్రీకాంత్, నాయకులు రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



జోనల్ కమిషనర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

గచ్చిబౌలి, మే 30(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. శుక్రవారం తన నివాసంలో గోపీనగర్‌కు చెందిన పుట్ట శకుంతలకు రూ. 2.5 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ప్రతినెలా రాష్ట్రంలో వందల కోట్ల రూపాయలు ఈ పథకం కింద ఇస్తున్నామన్నారు.

మాన్‌సూన్ ఫాగింగ్ యాక్షన్ ప్లాన్ ప్రారంభం

హైదర్‌నగర్, మే 30(ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్ సమత నగర్‌లో ఉన్న జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయంలో ఎంటమాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మాన్‌సూన్ ఫాగింగ్ యాక్షన్ ప్లాన్ కార్యక్రమాన్ని కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం ప్రారంభం అవుతుందని, వారానికి ఓ రోజు దోమల మందు పిచికారీ చేసే పైలెట్ ప్రాజెక్టు తన చేతుల మీదుగా ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ ఏడాది డివిజన్‌లో ఒక్క డెంగ్యూ కేసు కూడా నమోదు కాకుండా చేయాలనే లక్ష్యంతో పనిచేయాలని ఎంటమాలజీ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంటమాలజీ అధికారులు వెంకటేశ్వరరావు, ఏఈ తేజశ్రీ, సూపర్‌వైజర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, ఎంటమాలజీ అధికారులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాయదుర్గం, మే 30(ఆంధ్రజ్యోతి): డైమండ్‌హిల్స్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 3 నుంచి 3.30 గంటల వరకు జర్నలిస్టు కాలనీలో విద్యుత్ ఉండదని అధికారులు తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ఖాజాగూడ మెయిన్‌రోడ్, ఏసీ అట్లాటిక్ అపార్ట్‌మెంట్స్, వీకర్‌సెక్షన్‌కాలనీ, ఖాజాగూడ, ఓక్రిడ్జి స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదు. మీనాక్షి విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 11 వరకు మీనాక్షి, నానక్‌రాంగూడ, సాయిఐశ్వర్య కాలనీ, సాయి వైభవ్‌కాలనీ, అశోక్ బిల్డర్స్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదు. సాయంత్రం 4.30 నుంచి 5 గంటల వరకు సెక్రటేరియట్ కాలనీ, గణేష్ పార్కు, 4 నుంచి 4.40 వరకు పుప్పాలగూడ... పుక్తనగర్, 4 నుంచి 4.30 వరకు జయభేరి ఆరెంజ్ కౌంటి, ఐఐఆర్ఎం, డీడీఎల్, కేబుల్ బ్రిడ్జి ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. రాయదుర్గం ఫీడర్ పరిధిలో 3 నుంచి 3.30 గంటల వరకు రాయదుర్గం, మధురానగర్‌లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

వినాయక్‌నగర్ ఫీడర్ పరిధిలో..

హైదర్‌నగర్, మే 30(ఆంధ్రజ్యోతి): వినాయక్‌నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు శాతవాహననగర్, జయనగర్, రాంకీవిల్లాస్, భాగ్యనగర్ కాలనీ.. వెస్ట్రన్‌హిల్స్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు అడ్డగుట్ట రోడ్డు నెంబర్ 1 నుంచి 4, అడ్డగుట్ట రోడ్డు నెంబర్ 4 నుంచి 7 వరకు విద్యుత్ ఉండదన్నారు. జన్మభూమికాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 10.30 గంటల వరకు జన్మభూమికాలనీ, కమలమ్మకాలనీ, ఖాజానగర్, మహవీర్‌కాలనీ, డీటీ కాలనీలో విద్యుత్ ఉండదన్నారు.

ఓపెన్ జిమ్ ప్రారంభం

మియాపూర్, మే 30(ఆంధ్రజ్యోతి): మియాపూర్ డివిజన్ పరిధిలోని నాగార్జున ఎన్‌క్లేవ్ పార్కులో ఏసియామ్ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ప్రశాంతతో పాటు శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. పార్కులో ఓపెన్ జిమ్ పరికరాలను అమర్చడం సంతోషంగా ఉందన్నారు. సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధులను ఆయన అభినందించారు.

ప్రైవేట్ స్కూళ్లలో పుస్తకాల దందాను అడ్డుకోవాలి

●యూఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు చంద్రకాంత్

కుత్బుల్లాపూర్, మే 30 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాల విక్రయం దందాను అడ్డుకోవాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా యూఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు ఎం.చంద్రకాంత్ విద్యాశాఖ ఉన్నతాధికారులను కోరారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో ప్రతి సంవత్సరం మాదరిగానే ఈసారి కూడా పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌లను విక్రయిస్తున్నారని, విద్యా సంవత్సరం ప్రారంభం కాక ముందే తల్లిదండ్రులకు ఫోన్లు చేసి పుస్తకాలు, యూనిఫామ్‌లు తీసుకోవాలని ఒత్తిడి తెస్తున్నారని ఆయన ఓ ప్రకటనలో ఆరోపించారు. ఒక్కో విద్యార్థి నుంచి పుస్తకాలకే రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నారన్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాల విక్రయ దందాను అడ్డుకోవాలని చంద్రకాంత్ కోరారు.

ఎట్టకేలకు పూడిక మట్టిని తరలించారు!

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


సిల్ట్ వాహనంలోకి పూడిక మట్టిని వేస్తున్న సిబ్బంది

పేట్‌బషీరాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి): సిల్ట్ వాహనాలు ఎక్కడ? అనే శీర్షికన పూడిక మట్టి (సిల్ట్)ను రోడ్డుపై నుంచి తరలించకపోవడంతో దుర్వాసనతో స్థానికులు పడుతున్న ఇబ్బందిని తెలియజేస్తూ 'ఆంధ్రజ్యోతి' శుక్రవారం ప్రచురించిన కథనానికి జలమండలి అధికారులు స్పందించారు. జీడిమెట్ల డివిజన్ రాఘవేంద్ర కాలనీలో డ్రైనేజీ పైప్‌లైన్ నుంచి మూడు రోజుల క్రితం తీసి రోడ్డుపై వేసిన పూడిక మట్టిని ఎట్టకేలకు సిల్ట్ వాహనంలో అధికారులు తరలింపజేశారు.

మరమ్మతుల్లో నాణ్యత లేని సామగ్రి వినియోగం

●వాల్వ్‌ల నుంచి తరచూ వృథాగా పోతున్న తాగునీరు


వాల్వ్ నుంచి లీకవుతున్న తాగునీరు

పేట్‌బషీరాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి): లీకేజీలను అరికట్టడంలో అధికారులు అలసత్వం వహించడం వల్లే తాగునీరు వృథాగా పోతున్నదని కాలనీల ప్రజలు ఆరోపిస్తున్నారు. జీడిమెట్ల డివిజన్‌లోని సుచిత్ర నుంచి కుత్బుల్లాపూర్‌కు వెళ్లే రహదారిలోని ఫ్రూట్స్ దుకాణం సమీపంలో కాలనీల్లోకి నీరు విడుదల చేసినప్పుడల్లా వాల్వ్ నుంచి లీకేజీ అయి నీరు రోడ్డు పాలవుతోంది. దీంతో కొన్ని కాలనీలకు తాగునీరు రాక ప్రజలు అవస్థలు పడుతున్నారు. వాల్వ్‌కు మరమ్మతు చేసే సమయంలో కాంట్రాక్టర్లు నాణ్యత లేని సామగ్రిని వాడటం వల్ల మళ్లీ, మళ్లీ నీరు లీకేజీ అవుతోందని పలు కాలనీల ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు వాల్వ్‌లకు మరమ్మతులు చేసే సమయంలో దగ్గర ఉండి పనులను పర్యవేక్షించడంతో పాటు నాణ్యమైన సామగ్రిని వాడేలా చూడాలని వారు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

పేట్‌బషీరాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి): పేట్‌బషీరాబాద్‌సబ్-స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ జ్ఞానేశ్వర్ తెలిపారు. దుర్గాఎస్టేట్, బాలాజీ ఆస్పత్రి పరిధిలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, మీనాక్షి ఎస్టేట్, జయరామ్‌నగర్ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

ఆహ్లాదకరంగా అంబీర్ చెరువు

● అభివృద్ధి చేస్తామన్న ఎమ్మెల్యేలు వివేకానంద్, ఆరెకపూడి గాంధీ

●త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం


చెరువు అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు వివేకానంద్, గాంధీ

నిజాంపేట్, మే 30 (ఆంధ్రజ్యోతి): అంబీర్ చెరువును ప్రగతినగర్ ప్రజలకు ఆహ్లాదకరమైన వనరుగా అభివృద్ధి చేస్తామని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. అంబీర్ చెరువును ఇద్దరు ఎమ్మెల్యేలు శుక్రవారం సంబంధిత శాఖ అధికారులతో కలిసి సందర్శించి, చెరువు అభివృద్ధి, పరిరక్షణ పనులపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రగతినగర్ నుంచి వచ్చిన మురుగు నీటిని అంబీర్ చెరువులో కలువకుండా డైవర్షన్ చేసి శంషీగూడ ఔట్‌లెట్‌లో కలిపేందుకు రూ.90 లక్షలతో చేపట్ట తలచిన పనులను త్వరగా ప్రారంభించి వర్షాకాలం లోపే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అదే విధంగా చెరువు నీటి నిల్వ సామర్థ్యం, శుభ్రత, ఫుట్‌పాత్, వాకింగ్ ట్రాక్ వంటి అభివృద్ధి పనులపై కూడా అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా అంబీర్ చెరువును కాలుష్యం నుంచి కాపాడి ప్రగతినగర్ ప్రజలకు ఆహ్లాదం అందించే ప్రదేశంగా తీర్చిదిద్దాలని అధికారులను కోరారు. ప్రభుత్వం తరఫున అవసరమైన నిధులు, అనుమతుల కోసం తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యేలు వివేకానంద్, గాంధీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సాబేర్ అలీ, నీటి పారుదల శాఖ డీఈఈ నరేంద్ర, ఏఈఈ లక్ష్మీనారాయణ, స్థానిక బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సింగిల్ విండో చైర్మన్ బాల్‌రెడ్డి తదితరులు

బౌరంపేటలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

దుండిగల్, మే 30(ఆంధ్రజ్యోతి): పంట పొలాలకు అధికంగా యూరియా వాడటం వల్ల కలిగే దుష్పరిణామాలపై శాస్త్రవేత్తలు రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. దుండిగల్ మండలం, బౌరంపేటలోని సహకార సంఘంలో చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాని నిర్వహించారు. రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ శ్రీలత భూసార పరీక్షల ఉద్దేశం, మట్టి నమూనాలు, పరీక్షల ఆవశ్యకతను తెలియజేశారు. సేంద్రియ ఎరువుల వాడకం, జీవ ఎరువుల వినియోగం వల్ల ప్రయోజనాలను తెలియజేశారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి యాదగిరి వరి యాజమాన్య పద్ధతులను వివరించారు. ఎక్కువ యూరియా వాడటం కలిగే పరిణామాలను వివరించారు. ఈ సందర్భంగా అవగాహన కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో సొసైటీ డైరెక్టర్ భీమ్‌రెడ్డి, కృష్ణారెడ్డి వ్యవసాయ కళాశాల పీహెచ్‌డీ విద్యార్థిని కావ్య , ఎంబీఏ విద్యార్థి అలేఖ్య , రైతులు భరత్‌రెడ్డి, రామ్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, మాధవులు ఉన్నారు.

రోడ్డుపైనే వాహనాల పార్కింగ్


ఎల్లమ్మ గుడి సమీపంలో ఓ షాపు ముందు ఇలా..

కుత్బుల్లాపూర్, మే 30 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్, ప్రసూననగర్, కాకతీయనగర్, సుదర్శన్‌రెడ్డినగర్ ప్రధాన రోడ్డులో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. రోడ్డుకు ఇరువైపులా వ్యాపార సముదాయాలు ఉండటంతో అక్కడికి వచ్చే వినియోగదారుల వాహనాలను నిలిపేందుకు పార్కింగ్ సౌకర్యం లేక రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. రోజూ ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ రోడ్డుపై వాహనాల పార్కింగ్‌తో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. అత్యవసర సమయంలో ఈ రోడ్డు మీదుగా వెళ్లాలంటే కష్టతరంగా మారింది. రోడ్డుపై వాహనాలు నిలుపకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


నల్లా నుంచి వస్తున్న నీటిని పరిశీలిస్తున్న భరత్ సింహారెడ్డి

కలుషిత జలాల సరఫరాను అరికట్టండి

పేట్‌బషీరాబాద్, మే 30(ఆంధ్రజ్యోతి): తాగునీరు కలుషితం కాకుండా చూడాలని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి అధికారులను కోరారు. జీడిమెట్ల డివిజన్ వెంకటేశ్వర వెస్ట్ కాలనీలో ఆయన జలమండలి అధికారులతో కలిసి శుక్రవారం పర్యటించారు. కాలనీలోని కొన్ని ఇళ్లకు నల్లాల నుంచి కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయని స్థానికులు భరత్ సింహారెడ్డి, అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అధికారులు స్పందించి కలుషిత జలాలు ఇళ్లలోకి సరఫరా కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మందకృష్ణ మాదిగకు ఘన స్వాగతం పలకాలి

దుండిగల్, మే 30(ఆంధ్రజ్యోతి): వరంగల్‌కు ఈనెల 31న విచ్చేస్తున్న పద్మశ్రీ మందకృష్ణ మాదిగకు మాదిగ ఉప కులాలు, కుల సంఘ నాయకులు ఘన స్వాగతం పలకాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి సిలివేరు శ్రీనివాస్ మాదిగ పిలుపు నిచ్చారు. సూరారంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జగ్జీవన్‌రావు భవనంలో నాయకులతో కలిసి 'చలో వరంగల్' కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌మాదిగ మాట్లాడుతూ, వరంగల్‌లోని కాళోజీ కళాక్షేత్రంలో జరిగే ఎమ్మార్పీఎస్ అనుబంధ జాతీయ సంఘాల సమావేశానికి అందరూ హాజరై జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులు రాసమల్ల యాదగిరి, రమేష్, దేవయ్య పాల్గొన్నారు.


వాహనదారులు గొడవ పడుతుండటంతో నిలిచిన ట్రాఫిక్

గోదారి హోమ్స్ చౌరస్తాలో నిత్యం ట్రా'ఫికర్'

●కానిస్టేబుళ్లను నియమించాలని స్థానికుల వినతి

పేట్‌బషీరాబాద్, మే 30(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నుంచి సుచిత్ర వెళ్లే రహదారిలో గోదావరి హోమ్స్ చౌరస్తాలో నిత్యం వాహనదారులు గొడవ పడుతున్నారు. దీంతో బ్యాంక్ కాలనీ, గోదారి హోమ్స్, సుచిత్ర, కుత్బుల్లాపూర్ నుంచి వచ్చిపోయే వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నాయి. ఈ ప్రాంతంలో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ఉదయం, సాయంత్రం వేళల్లో కానిస్టేబుళ్లను నియమించాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు. గురువారం సాయంత్రం ఈ ప్రాంతంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. అదృష్టవశాత్తూ వాహనదారులకు ఏమీ కాలేదు. కాకపోతే ఒక ద్విచక్ర వాహనదారుడు మరో ద్విచక్ర వాహనదారుడిపై చెయ్యి చేసుకున్నాడు. ఇద్దరూ రోడ్డుపై గొడవపడటంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. రోడ్డుపై వెళ్తున్న మిగతా వాహనదారులు ఇద్దరినీ సముదాయించి పంపేశారు. ఇంకో 13 రోజుల్లో పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. ఈ రోడ్డుపై ట్రాఫిక్ మరింత పెరిగి, ట్రాఫిక్ జామ్‌లయ్యే అవకాశం ఉంది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని గోదారి హోమ్స్‌కు వెళ్లే చౌరస్తాలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు కానిస్టేబుళ్లను నియమిస్తే ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా ఉంటుందని స్థానికులంటున్నారు.

ఆలయాల సందర్శనతో మానసిక ప్రశాంతత


ఆలయ పూజారులతో ఎమ్మెల్యే తదితరులు

జీడిమెట్ల, మే 30(ఆంధ్రజ్యోతి): ఆలయాల సందర్శనతో మనస్సు ప్రశాంతంగా ఉంటుందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. సుభాష్‌నగర్ డివిజన్‌లోని బాలమురుగన్ కుమార స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తమిళియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు ఎమ్మెల్యే హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో తమిళియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. కోటస్వామి, ఉపాధ్యక్షుడు ఆర్ గణేషన్, ప్రధాన కార్యదర్శి చిన్నస్వామి టి. భాస్కర్, ఎస్. ఆనందం, భక్తులు పాల్గొన్నారు.